# ప్రేమించని పెళ్లాం...!

నేనేపని చేసినా మూతివిరుపే ! అనహ్యాంచుకోవటమే ! ముఖం చిట్లించుకొంటుందీ మెటికలు విరుస్తుంది. తిట్టిపోస్తుంది. సాధిస్తుంది !.

నా పెళ్లి అయి పదేళ్లయినా భారతి తీరు ఇదే ! ఏమాత్రం మారలేదు. అది నోరు తెరచి అడక్కుండానే ముందుగానే అన్నీ సమకూరుస్తాను.

ఇద్దరు పిల్లల తల్లి అయినా ఏటా పాతిక చీరలు కొంటాను. పండుగ వస్తే పట్టుచీర తప్పదు. పెళ్లికి పెట్టిన బంగారం మూట అలావుంచి... ఈ పదేళ్లల్లో పాతిక తులాల బంగారంతో నగలు చేయించాను.

నేనంటే నా పెళ్లానికి బొత్తిగ ప్రేమ లేదు. నన్ను అభిమానించదు. దగ్గరకు తీసుకోదు. అయ్యో మొగుడే అనుకోదు. వాళ్ల కన్నవాళ్లొచ్చినప్పుడల్లా వున్నవీ లేనివి కల్పించి చెప్తుంది. నన్నో వెదవను చేసి మాట్లాడుతుంది. దాని దృష్టిలో నేనొక అయోగ్యుడిని ! ఎందుకూ పనికిరాని వాడిని !.

నాకు చదువుంది ! మంచి వుద్యోగం వుంది. సొంత కారుంది. సోషల్ స్టేటస్ వుంది. స్వంత ఇల్లుంది. నెలకు యాభై వేలకు పైగా జీతం చేతికొస్తుంది. బ్యాంకులో డిపాజిట్లున్నయ్. లెక్కలేనంత క్యాష్ బేలన్సుంది. అయినా ఇంకా ఏదో లేదనే అసంతృప్తి భారతికి.

భారతి కూడా అక్షరమ్ముక్క రాని మనిషేంకాదు. డిగ్రీ చేసింది. సిటీలో పుట్టిపెరిగింది. ఆ మనిషికి ఎంతచేసినా లోటే.

నా జీవితం యాంత్రికంగా సాగుతోంది. నాలో తృప్తి... సంతోషమన్నది లేకుండా పోవటానికి ముఖ్యకాణం భారతి ! నా సంగతి పక్కనపెడితే... పిల్లలనైనా పట్టించుకోదు. వాళ్ళ పట్ల శ్రద్ధ లేదు. పసిమనసులకు ఏం కావాలో ఏంచేస్తే పిల్లలు మనలను అభిమానిస్తారో తెలియదు. వాళ్ళు దగ్గరకొస్తే అరుస్తుంది. విసుక్కుంటుంది. కోపం ప్రకటించి చీవాట్లు పెడుతుంది.

నా దగ్గరే పిల్లలిద్దరికీ చనువెక్కువ ! ఇద్దరి మగవెధవల గురించే నేను శ్రద్ధపెట్టి

పట్టించుకుంటాను. పిల్లలకు స్నానాలు చేయించటం... తలకు నూనె రాసి దువ్వి బ్రేక్‌ఫాస్ట్ తిన్పించి కార్లో రోజు కాన్వెంట్‌లో డ్రాప్ చెయ్యటం నావంతు !. పిల్లల పన్లు చేస్తుంటే ఎంతో తృప్తిగాను సంతోషంగానూ వుంటుంది నాకు !

నాకు ఫ్రెండ్స్ సర్కిల్లేకకాదు, క్లబ్బులకు పబ్బులకు వేళ్లే అలవటు లేదు. సిగరెట్ తాగను మందు జోలికి పోను. 'రాముడు మంచి బాలుడు' అంటూ స్నేమితులు కొలీగ్స్ నన్ను ఏడిపిస్తూంటారు.

ఇల్లే నాకు స్వర్గం ! కడుపే కైలాసం ! పిల్లలిద్దరూ నా రెండు కళ్లూ ! రాత్రిళ్లు ఇద్దరినీ చెరొకవైపు పడుకోపెట్టుకు మంచం ఎక్కితే గాని నాకు నిద్ర పట్టదు.

పిల్లలు వాళ్ల మమ్మీని చూచి బెదిరిపోతారు. ఓదయ్యాన్నో... బూతాన్నో చూచినట్టు భయపడతారు. లంచ్ బాక్స్ తీసుకెళ్తారు కాబట్టి కాన్వెంట్లో ఆయా భోజనం తినిపిస్తుంఇ రాత్రిళ్లు నా చేతులతో పిల్లలిద్దరికీ తిన్పిస్తేనే వాళ్లకు తృప్తి.

భారతి నేనన్నా... పిల్లలన్నా అభిమానంగ ప్రేమగ వుండలేకపోవటానికి కారణం ఇన్నేళ్ళుగా ఎంత ఆలోచించినా అంతుచిక్కదు.

బహుశ... భారతిలో ఏదో వెలితి... అసంతృప్తి వుందేమోన్పిస్తుంది. మనసు విప్పి మాల్లాడదు. ఇలాంటి భార్యతో ఎలా కాపురం ఇన్నేళ్లుగ చేస్తున్నానా?... ఇద్దరు పిల్లలు మాకు ఎలా కలిగారన్నది చూసేవారికి విడ్డూరంగ వుంటుంది.

భారతి జోవియల్‌గ వుండనే వుండదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నదానిలా వుంటుంది, వేళకు తినదు... నిద్ర పోదు ఇంట్లో ఏపనీ మనసుపెట్టి శ్రద్ధగా చేయదు. పుస్తకం చదువుతూ విసిరేస్తుంది. చూస్తున్న టీ.వి. మంచి ప్రోగ్రామ్స్ వస్తున్నా మధ్యలో ఆఫ్ చేస్తుంది. మనిషిలో సైకిక్ లక్షణాలేవీ లేవు. మూడీగ వుంటుందంతే !... తనకు ఫలానాది కావాలని నోరు తరుచి అడగదు.

భారతిలో అన్నీ అవలక్షణాలు... మైనస్ పాయింట్లే!... అయినా సహనంతో భరిస్తున్నాను. నేనే మంచిపని చేసినా మెచ్చుకోదు. ఇరుగు పొరుగుకి నాగురించి గొప్పగా చెప్పదు.

భారతిపై చెయ్యి చేసుకోవటం... గొడవపడటం నాకు ఇష్టముండదు. నేను ఎలాంటి డ్రెస్ వేసుకున్నా భారతికి నచ్చదు. ఏదో వంకపెడుతుంది. పోనీ తన

టేస్టేమిటో వివరంగ చెప్పదు. అడిగినా... బ్రతిమాలినా... కేకవేసినా... నోరు విప్పదు.

తిండి విషయానికొస్తే... నాకు ఇడ్లీలంటే లైకింగ్ ! రోజూ అదే టిఫిన్ పెట్టినా తింటాను. పిల్లలదీ నా టేస్టే ! అది కాఫీ తాగదు. రాత్రి మిగిలిన చద్ది అన్నంలో ఆవకాయ కలుపుకుని మింగేస్తుంది.

మమ్మల్నేమో... రోజూ ఇడ్లీ ఏంటి అసహ్యంగ... ఆస్పత్రిలో రోగులకు పెట్టినట్టు అనేసి వ్యాఖ్యానిస్తుంది. పోనీలెమ్మని బ్రెడ్డు... బాయిల్డ్ ఎగ్.. జామ్... తెస్తే... లంఖణాలు చేసిన వారిలా ఇదేం తిండి? అనేసి ఎత్తిపొడుస్తుంది. హేళన చేస్తుంది.

నన్నూ... పిల్లల్నీ.. తనతోపాటు చద్ది అన్నం తినమంటుంది. అది నాకిష్టంలేదు. వంట భారతికి డొత్తిగ చేతకాదు. మనసుపెట్టి పెళ్లి అయి అత్తవారింటికి వచ్చాక అయినా నేర్చుకోలేదు. వఠి టేస్ట్ లేని మనిషి ! ఈరోజుల్లో వుండాల్సిన ఆడది కాదు.

రోజూ ఇడ్లీ తింటానని నన్ను ఎగతాళి చేస్తుంది ! నా తిండి నా టేస్ట్... నాయిష్టం ! ఎవరు కామెంట్ టాలరేట్ చెయ్యను.

ఆ పిచ్చిపిల్లతో నీకు వాదనెందుకులేరా అబ్బీ... నేనున్నాగా నీక్కావలసింది చేసిపెట్టటానికి... అని మమ్మీ అంటేచాలు... తోక తొక్కిన తాచులా అత్తగారి మీదికి తగాదాకెడుతుంది భారతి.

'నన్ను పిచ్చిదాన్ని అనకండి ! నేను వూరుకోను ! నాకే పిచ్చిలేదు. ఈ కారణంగ నన్ను పిచ్చాసుపత్రిలో జాయిన్ చేద్దామనుకుంటున్నారేమో... మీ ఆటలు సాగనివ్వను...' అనేసి గయ్‌మంటుంది భారతి.

'ఏదో మాటవరసకన్నానులేవే కోడలా...' నవ్వేసి భారతి సీరియస్‌నెస్‌ను ఐస్‌క్రీంలా కరిగించేస్తుంది అమ్మ.

ఆరోజంతా భారతి ఇంట్లోవాళ్లమీద చిరాకు పడుతునేవుంటుంది. నేనెంత బుజ్జగించినా నార్మల్ కండిషన్‌కు రాదు.

నైటీలు... మ్యాక్సీలు వేసుకోదు భారతి! అదేమంటే తనకు ఇష్టంలేదంటుంది. పోనీ 'జీన్స్' డ్రెస్ అయినా బైటికి కార్లో నావెంట వచ్చేటప్పుడైనా వేసుకోమంటే మనిషి ఫైరవుతుంది.

అవున్లే... భారతీయ వనితలు చీరలే ధరించటం సాంప్రదాయం... అనేసి దాన్ని దువ్వితేగాని టెంపరేచర్ తగ్గి థర్మామీటర్లో నార్మల్ చూపించదు.

తననేం అనకూడదు. ప్రతి చిన్న కామెంట్‌కు వుడుక్కుంటుంది.

పిల్లి అయిన సంవత్సరమే... ఓ పండుక్కి భారతిని గోరింటాకు పెట్టుకోమని ఆకు తెచ్చి రుబ్బి మరీ ఇచ్చింది మమ్మీ.

పెట్టుకోనంటే పెట్టుకోనని మొండికేసింది భారతి.

తప్పమ్మా ఆడవాళ్లు గోరింటాకు తప్పక పెట్టుకోవాలి. చేతులు ఎంత ఎర్రగ పండితే.. మొగుడి మీద అంత ప్రేమవున్నట్టు... అంది మమ్మీ.

'మీ అబ్బాయి మీద నాకు ప్రేమ లేదులెండి అందుకే పెట్టుకోను... పెట్టుకున్నా నా చెయ్యి ఎర్రగా పండదు...' కటువుగ అంది భారతి.

ఇహ అక్కడితో గోరింటాకు టాపిక్ ఆపేసింది మమ్మీ.

'చూశావుట్రా నీ పెళ్లాం ఆగడం... ఎడ్డెమంటే తెడ్డెమంటుంది. దీన్తో వేగటం కష్టమే...' నాతో రిపోర్ట్ చెయ్యటం భారతి విని రయ్‌న నాపై యుద్ధానికొచ్చి 'నేను నా అలవాట్లు ఇష్టం లేనప్పుడు... మనం విడిగానే వుందాం... రండి... అంతా ఎందుకు కలిసివుండటం...' ఏదేదో వాగి రచ్చ చేసింది.

'చూడూ ! నువ్వే వరల్డ్ బ్యూటీ కాదు ! జస్ట్ యావరేజ్ గరల్ అయినప్పటికీ నిన్ను ఇష్టపడి పెళ్లిచేసుకున్నాను. మీ వాళు నిష్ఠదరిద్రులని తెల్సినా... నేను ఆగర్భశ్రీమంతుడినైనా... కావాలని నిన్ను కోరుకున్నాను. కాబట్టి అందరితో ఆప్యాయంగవుంటూ ప్రేమని అభిమానాన్నీ పెంచుకో...' హితవు పలికాడు.

ఆ మాట అన్నందుకు అలిగి పుట్టింటికి పోతానంది.

'అక్కడేముందని పోతావ్ ? నీకోపూట కడుపునిండా తిండి అయినా పెట్టలేని పిరిస్థితి మీడాడీది ! - అక్కడికెళ్లి పస్తులుండటం దేనికిగాని... నీ ప్రపోజల్ మానుకో...'

రివ్వున తనగదిలోకి గుడ్ల నీరుకుక్కుకుని వెళ్లిపోయింది భారతి.

XXX

నాతలకు నూనె రాసి ఎదగదు. నావీపురుద్దిన పాపాన పోలేదు. నా నెక్ 'టై' కి నాక్ ఎలా వెయ్యాలో తెలీదు. నా మనసులో ఏముందో తెలుసుకుని తదనుగుణంగా నడుచుకోవాలనే అభిమతంలేదు.

పక్కనేవుండి భోజనం చేస్తుంటే కొసిరి కొసిరి వడ్డించటం గురించి పట్టించుకోదు. పడకగదిలో తాంబూలం ఇవ్వటం అసలేలేదు.

నా దృష్టిలో భారతి కల్చర్‌లెస్ బ్రూట్ ! అయినా ఎన్నడూ నేను దాన్ని దూషించలేదు. అవమానించలేదు. అసహ్యించుకోలేదు.

పెళ్లి అనేది జీవితానికొకసారే జరుగుతుందని తెలిసినవాడిని ! ఆడది భార్య స్థానంలో ఒకేఒకసారి వచ్చి జీవితాన్ని సుఖమయం చేస్తుందని కలలు కన్నాను. ఆశించాను. ఎన్నెన్నో తీపికలలుకన్నాను.

పెళ్లి అయ్యాక నా ఆలోచన్లన్నీ రివర్స్ అయినయ్. ఆశించింది వేరు... జరిగింది మరొకటి !

భారతిని ముద్దుగ షార్‌టకట్లో 'బారూ' అని పిలవాలన్పించి ఒకసారి కేకేశాను.

'మీరలా పిలవకండి... పెద్దలు పెట్టిన పేరును 'సెన్సార్' చేసి పిలవటం నాకు నచ్చదు... 'బారు' ఏంటండీ? 'బీరు' లాగ... చిటపటలాడుతూ అంది.

'సర్లే ! ఫుల్ నేమ్‌తోనే పులుస్తాను . ఓ.కే.!

'ఎగ్రీడ్ !... ఏమండీ మీకో విసయం చెప్పనా ?...

'ఊ.. నీదే ఆలశ్యం.. డోన్ట్ డిలే... జల్దీ చెప్పు...'

'మీరు సూట్‌లో కంటే పంచ లాల్చీలోనే బావుంటారు...'

'అంతేనా !... భుజాన జరీ కండువా వద్దా...? -

"ఏంటీ వెటకారమా...'

'కాదే పిచ్చి మొహమా... నేనేం రాజకీయకీయనాయకుడినా అలాంటి డ్రెస్ వేసుకోవడానికి. నేను కంపెనీ ఎండీ. ని! ఫారిన్ డిగ్నిటరీస్‌తో కలుస్తూంటాను. అప్పుడప్పుడు ఫారిన్ వెళ్లాల్సి వుంటుంది. నేను 'సూట్' వేసుకోవటమేక 'సూటబుల్' అవునా?...'

'అంతే... అంతే... నే చెప్పేపది మీకు నచ్చనపుడు.. నామాట విననప్పుడు.. నెనెందుకు మాల్లాడాలి...' మూతి ముడుచుకుంది భారతి.

X X X

ఎంతో మంది 'ఇండస్ట్రియలిస్ట్' తమ పిల్లలని కోట్ల కట్నమిచ్చి పెళ్లి చేస్తానంటే...

వద్దనుకుని సీదా సాదా ఆడపిల్లే కావాలని కోరుకుని భారతి మెళ్లో తాళి గట్టాను.

నా 'రోగం' బాగా కుదిర్చాడా దేవుడు. తిక్కల దాన్ని పోయిపోయి పెళ్లాడాను ! నా రోగం కుదరాల్సిందే ! నావూహలకు... ఆలోచనలకు కళ్లెం పడింది ! అయినా డిప్పాయింట్ కాలేదు. మనసుకు నచ్చచెప్పుకుంటూ రాసాగాను.

నేనెంతగ ఒదిగివుంటున్నా... భారతి నా పట్ల కొరివి దయ్యమైంది.. ఇలా జీవితాంతం వుండిపోవటమంటే ప్రాబ్లమౌతుంది. దీనికో సొల్యూషన్ గురించి నీ అభిప్రాయమేంటి? ఆర్‌యూ ఆల్‌రైట్... లేకపోతే డాక్టర్ని కన్సల్ట్ చేద్దామా?..' అని అడిగాను.

'డాక్టర్నా... దేనికి ?-'

'నీ యాటిట్యూడ్ డిఫరెంట్‌గ వున్నదన్పిస్తోంది. నువ్వు నన్ను... పిల్లలను అభిమానించలేకపోవటం విచిత్రంగాను విడ్డూరంగానూ వుంది. నీ మెంటల్ కండిషన్ బేలన్స్‌డ్ గ లేదేమో అన్పిస్తోంది. నువ్వు అందరిలా వుండలేకపోవటం చూస్తుంటే ఆశ్చర్యంగాను బాదగాను వుంటోంది. నీలో ఏదైనా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ వుందా? - హేపీగా వుండేటందుకు ఎందుకు ప్రయత్నించటంలేదో మాకు బోధపడని విషయం !. నీకేమైనా కౌన్సిలింగ్ అవసరమేమోనని అన్పిస్తోంది... '

'నో ! అలాంటిదే అక్కర్లేదు. ఐయామ్ ఆల్‌రైట్...' అని చెప్పి టీ.వీ. ప్రోగ్రామ్ చూడటంలో నిమగ్నమైంది భారతి.

X X X

తెల్లారి భారతి ఇంట్లో కన్పించకపోవటంతో... బహుశ పుట్టింటికేమైనా వెళ్లిందేమోని మామగారిని ఫోన్ ద్వారా కాన్టాక్ట్ చేసి భారతి వాళ్లింటికేమైనా భారతి వచ్చిందాని అడిగిన నాకు నెగెటివ్ రిప్లై వచ్చింది. నాలో కలవరం మొదలైంది. ఎక్కడికి ఇంత ఉదయాన్నే లేచి వెళ్లివుంటుంది? బహుశ ఎర్లీగా లేచి మార్నింగ్ వాకెళ్లి వుంటుందా?... భారతికీ అలవాటు లేదే? -

కోడలు కన్పించకపోవటంతో మమ్మీ డాడీ కూడా కంగారుపడ్డారు. పోలీసు రిపోర్ట్ ఇవ్వటం గురించి చర్చిందుకుని వద్దనుకున్నాం !

'డాడీ.... మమ్మీ రాసిన లెటర్ డ్రెస్సింగ్ టేబులు ముందు కన్పించింది...'

పెద్దవాడు తెచ్చి నాకిచ్చాడు.

మీరు చెప్పింది నిజం ! నేను సైకిక్‌నే ! నాకు బ్రతకాలని లేదు. చనిపోవాలని వెడుతున్నాను. మీ 'బారు' ను శాశ్వతంగ మర్చిపోండి.

లెటర్‌లోని సారాంశం నన్ను కలవరపరిచింది ! భారతి డెడ్ బాడీని హుసేన్‌సాగర్‌లో ట్రేస్ చేశారు పోలీసులు.

నాకు ఫోన్ రాగానే కార్లో బయల్దేరాను. చెప్పిన వెంటనే నా ఎ.సి.పి. ఫ్రెండ్ సాయం చేశాడు. పోలీసులను అలర్ట్ చేసి సిటీలో చెరువుల వద్ద ఏదైనా ఆడ మనిషి శవం తాలూకు వివరాలు దొరుకుతాయేమోనని వెతకమంటూ తన ఆధీనంలో వున్న అన్ని పోలీస్ స్టేషన్లకు మెసేజ్ పాసాన్ చేశాడు.

హుసేన్‌సాగర్‌లో శవం గురించి పోలీసులకు సమాచారం అందగానే.. నాకు ఫోన్ చేసి అటు వెళ్లి శవాన్ని ఐడెంటిఫై చేయమనగానే బయల్దేరిన నేను సాగర్ చేరుకుని అక్కడున్న శవం భారతిదేనని గుర్తించి... పోలీసు కేసు కాకుండా చూడమని ఎ.సి.పి. కి చెప్పి భారతి డెడ్‌బాడీని ఇంటికి అంబులెన్స్‌లో చేర్చాను.

నన్ను ప్రేమించనందుకు కాకపోయినా తన నండుజీవితాన్ని అర్ధాంతరంగ ముగించుకున్న భారతి పిరికి చర్యకు నా మనసు మూగగా రోదించింది.

---సమాప్తం---